TG/TEL/25/A3731

నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-234 | పేజీలు:-4 | శుక్రవారం 07-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు

- ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని

2లో

రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు

సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి - మిగతా 2 లో

బస్సు సౌకర్యం కోసం మంత్రిని కోరిన ఆరేళ్ల బాలుడు

- ఆరేళ్ల బాలుడి వినతిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఖమ్మం జిల్లాలో ప్రజా దర్బార్ సందర్భంగా ఈ ఘటన
- వారంలో బస్సు నడపాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం
- సర్వే అవసరం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం

తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఒక ఆరేళ్ల బాలుడు సమర్పించిన వినతిపత్రం - మిగతా 2 లో

రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్

- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వాలని విన్నపం
- రాహుల్ గాంధీకి ఫోన్ చేసిన కిరణ్ రిజిజు
- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు కోరిన కేంద్రం
- మహిళా రిజర్వేషన్ల అమలు కోసమే ప్రయత్నమన్న రిజిజు

మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల - మిగతా 2 లో

తరుణ్ తేజ్‌పాల్‌కు ఊహించని షాక్

- 2013 రేప్ కేసులో దోషిగా నిర్ధారిస్తూ బాంబే హైకోర్టు సంచలన తీర్పు
- తెహెల్కా పత్రిక మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు భారీ షాక్
- నిర్దోషిగా ప్రకటిస్తూ విచారణ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిన బాంబే హైకోర్టు
- తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా ప్రకటిస్తూ తీర్పును వెలువరించిన డివిజన్ బెంచ్

'తెహెల్కా' పత్రిక మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్ కు బాంబే హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. - మిగతా 2 లో

ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ కొత్త రీల్
ఈసారి యువతకు ప్రధాని స్పెషల్ ఛాలెంజ్

- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ యువతకు ప్రత్యేక పిలుపునిచ్చారు
- చేనేత దుస్తులు ధరించి GRWM వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేయాలని సూచించారు.
- చిన్న, పేద చేనేత కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పిలుపునిచ్చారు. ఆగస్టు 7న నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడంతో పాటు,

2లో

అమెరికాలో మరోసారి కాల్పుల మోత నార్త్ కరోలినాలో పలువురి మృతి

- కాల్పుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి
- మృతుల్లో కాల్పులు జరిపిన నిందితుడు కూడా ఉన్నట్లు వెల్లడి
- ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అమెరికాలో మరోసారి తుపాకి గర్జించింది. నార్త్ కరోలినాలోని కాస్వెల్ కౌంటీలో ఉన్న ఒక ఇంట్లో జరిగిన మాస్ షూటింగ్ ఘటనలో పలువురు మరణించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కాల్పులు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడ పలువురు తుపాకి - మిగతా 2 లో

మిలిటరీ హెలికాప్టర్‌లో ట్రంప్.. సమీపంగా వెళ్లిన కమర్షియల్ విమానం

- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయాణిస్తున్న
- మిలిటరీ హెలికాప్టర్‌కు అతి సమీపం నుంచి ప్రయాణికులతో కూడిన ఓ విమానం వెళ్లింది.
- ఈ ఘటన పట్ల ఏవియేషన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు

వైట్‌హౌజ్ నుంచి మెరైన్ వన్ హెలికాప్టర్‌లో ట్రంప్ బయలుదేరగా, ఇక రీగన్ వాషింగ్టన్ నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఓ విమానం డిపార్ట్ అయ్యింది. అయితే గాలిలో ఉన్నసమయంలోనే హెలికాప్టర్, జెట్ సమీపంగా వచ్చినట్లు భావిస్తున్నారు. కానీ అమెరికా అధ్యక్షుడు క్షేమంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. - మిగతా 2 లో

చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక
ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

- 'నేతన్న సేవలో' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల సాయం
- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల ప్రయోజనం
- ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛన్లతో పాటు పలు సంక్షేమ పథకాల అమలు
- చీరాల పర్యటనలో నేతన్నలతో ముఖాముఖి భేటీ కానున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి వృత్తిని పరిరక్షించేందుకు ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో 'నేతన్న సేవలో' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది.

2లో

మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్
పిఠాపురం రూపురేఖలు మార్చేస్తున్న డిప్యూటీ సీఎం

- పిఠాపురంలో రూ.200 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేసిన పవన్
- డిప్యూటీ సీఎం చొరవతో 307 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మాణం
- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి.. పలు గ్రామాల్లో తీరిన కష్టాలు
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు యుద్ధప్రాతిపదికన పరిష్కారం

ఏపీ డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గంపై - మిగతా 2 లో

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం 11వ రోజూ విజయవంతం

- 11 రోజుల్లో 30.38 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- నేడు అత్యధిక ఇళ్లను 3.40 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రతి ఇంటికీ వివరిస్తున్న పార్టీ శ్రేణులు
- టెక్నాలజీ ద్వారా కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న నారా లోకేష్

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని, అమలు - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 07-08-2026

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం 11వ రోజూ విజయవంతం

మొదటిపేజీ తరువాయి – చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం విజయవంతంగా 11వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11వ రోజున రాష్ట్రవ్యాప్తంగా 3.40 లక్షల గృహాలను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ఒకే రోజులో ఇంత పెద్ద సంఖ్యలో ఇళ్లను సందర్శించడం ఇదే ప్రథమం. దీంతో గత 11 రోజుల్లో మొత్తంగా 30.38 లక్షల గృహాలకు చేరుకుని, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును ప్రతి ఇంటికీ చేరవేశారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిరంతరం సమీక్షిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి సందర్శనలు, పార్టీ శ్రేణుల పనితీరుపై ఆయన ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను నారా లోకేశ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

బస్సు సౌకర్యం కోసం మంత్రిని కోరిన ఆరేళ్ల బాలుడు

మొదటిపేజీ తరువాయి – అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ అంశంపై తక్షణమే స్పందించిన తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వారం రోజుల్లోగా బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆ చిన్నారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఖమ్మం జిల్లా కల్లూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఈ ఆసక్తికర ఉదంతం చోటుచేసుకుంది. ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన ఓ ఆరేళ్ల బాలుడు తన తండ్రితో కలిసి ఈ కార్యక్రమానికి విచ్చేశాడు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, వెంటనే బస్సును ఏర్పాటు చేయాలని కోరుతూ స్వహస్తాలతో రాసిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశాడు. ఆ చిన్నారి చొరవను, ధైర్యాన్ని చూసి ముచ్చటపడిన మంత్రి తక్షణమే స్పందించారు. అక్కడే ఉన్న టీజీఎస్ఆర్టీసీ అధికారులను పిలిచి, సదరు గ్రామానికి బస్సు సర్వీసును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అయితే, నిబంధనల ప్రకారం ముందుగా సర్వే నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు వివరించగా, మంత్రి అందుకు సమ్మతించలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారం రోజుల్లోగా బస్సు ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బస్సు రాకపోతే నేరుగా తనకు ఫోన్ చేయాలని ఆ బాలుడికి భరోసా ఇచ్చారు.

రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

మొదటిపేజీ తరువాయి – నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (+=వీడీ) అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క–సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి – అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్

మొదటిపేజీ తరువాయి – మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఫోన్ చేసి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశంపై రాహుల్ గాంధీతో రిజిజు మాట్లాడటం ఇది మూడోసారి అని తెలుస్తోంది. బిల్లుకు ప్రతిపక్షం సహకరిస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగవంతమవుతుందని ఆయన వివరించినట్లు సమాచారం. లేదంటే మహిళల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కూడా రిజిజు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై రాహుల్ గాంధీ ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం. ముందుగా కాంగ్రెస్ మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించి తర్వాత పార్టీ వైఖరిని వెల్లడిస్తామని రిజిజుకు చెప్పినట్లు తెలిసింది. అయితే డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ పార్టీ ఎంపీ కే.సి. వేణుగోపాల్ బుధవారం స్పష్టం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందలేదు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దేశ రాజకీయ, జనాభా సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనతోనే బిల్లును వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ గతంలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది.

తరుణ్ తేజ్‌పాల్‌కు ఊహించని షాక్

మొదటిపేజీ తరువాయి – 2013 నాటి సంచలనాత్మక లైంగిక దాడి కేసులో ఆయనను విచారణ కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను బాంబే హైకోర్టు రద్దు చేసింది. ఈ కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారిస్తూ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. 2013 నవంబరులో గోవాలో జరిగిన 'థింక్‌ఫెస్ట్' ఈవెంట్ సమయంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఆయన వద్ద పనిచేసిన ఒక మహిళా జర్నలిస్ట్ ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారించిన గోవాలోని మాపుసా సెషన్స్ కోర్టు 2021లో తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. అయితే, ఈ 'అక్విట్టల్' తీర్పును సవాలు చేస్తూ గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో అప్పీలు చేసింది. గోవా ప్రభుత్వం తరఫున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, తేజ్‌పాల్ తరఫున సీనియర్ అడ్వకేట్ ఆబాద్ పోండా సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఘటన తర్వాత బాధితురాలి ప్రవర్తనను విచారణ కోర్టు తప్పుగా అంచనా వేసిందని, ఆధారాలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని ప్రభుత్వం వాదించింది. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్‌సాండేకర్‌లతో కూడిన డివిజన్ బెంచ్.. విచారణ కోర్టు నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఐపీసీలోని రేప్ నిబంధనల ప్రకారం తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా ఖరారు చేసింది. ఆ సమయంలో కోర్టు హాలులోనే వున్న తేజ్ పాల్ తన వయసును (ప్రస్తుతం 62 సంవత్సరాలు) దృష్టిలో పెట్టుకుని కనికరం చూపాలని వేడుకున్నారు. కాగా, నేటి మధ్యాహ్నం 2.30 గంటలకు శిక్షను ఖరారు చేస్తారు. కేసు తీవ్రతను బట్టి కనీసం 10 సంవత్సరాల జైలుశిక్ష పడుతుందని భావిస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలోనే పిఠాపురాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, పల్లె నుంచి పట్టణం వరకు రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఏకంగా రూ.200 కోట్ల అంచనా వ్యయంతో రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 307 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇప్పటికే రూ.100 కోట్ల వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరో 70 రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. దీంతో నియోజకవర్గంలో దాదాపు 80 శాతం కొత్త రోడ్ల నిర్మాణం పూర్తయినట్లయింది. ఈ పనులతో గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల ప్రయాణ కష్టాలు తొలగిపోయి రోడ్లన్నీ కళకళలాడుతున్నాయి.

ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం

ఉప్పాడ తీరంలో అలల కోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాయాపట్నం మత్స్యకారుల కోసం సుబ్బంపేట సమీపంలో ఏర్పాటు చేసిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో మౌలిక వసతుల కల్పనపై పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారు. రూ.1.52 కోట్లతో 1.5 కి.మీ. సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. అలాగే, కొత్తసూరాడపేట కాలనీకి రూ.93 లక్షలతో 1.6 కి.మీ. సిమెంట్ రోడ్డు వేసి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. డిప్యూటీ సీఎం కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. తుపాన్లకు దెబ్బతిన్న యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి, రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ.88 లక్షలతో పునర్నిర్మించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఎస్ఈజెడ్ పరిధిలోని ముమ్మిడివారిపాడు గ్రామానికి రూ.79.70 లక్షలతో శాశ్వత రహదారి సౌకర్యం కల్పించారు. కొత్తపల్లి గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన శ్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని రూ.26.30 లక్షలతో నిర్మించి, 4 వేల మంది ప్రజల ఇబ్బందులను తొలగించారు. గత ఏడేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కొండెవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పిఠాపురం–ఉప్పాడ ఆర్అండ్‌బీ రోడ్డును రూ.1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. ఈ రహదారి నిర్మాణంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులతో పాటు సుమారు 8 వేల మంది ప్రజల ప్రయాణ కష్టాలు తీరాయి.

చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక

మొదటిపేజీ తరువాయి – 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లు జమ కానున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వనప్పటికీ, చేనేత వృత్తిని, దాని వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తోంది. ఈ కొత్త పథకంతో పాటు ఇప్పటికే ప్రభుత్వం చేనేత రంగానికి అనేక విధాలుగా మద్దతు అందిస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. అంతేకాకుండా, చేనేతల వృద్ధాప్య పింఛన్ వయసును 50 ఏళ్లకు తగ్గించి, రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మందికి నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ల కోసం ఏటా రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసా వారి జీవనోపాధికి అండగా నిలుస్తోంది. చేనేత రంగాన్ని మౌలికంగా బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం దీర్ఘకాలిక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాజధాని అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల భారీ పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం ఈ రంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు చీరాలలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, వేటపాలెం మండలం కొత్తపేటకు చేరుకుంటారు. ఉదయం 11:05 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:35 గంటలకు జాండ్రపేటలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో నేతన్నలతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4:10 గంటలకు కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ కొత్త రీల్
ఈసారి యువతకు ప్రధాని స్పెషల్ ఛాలెంజ్

మొదటిపేజీ తరువాయి – చేతితో నేసిన వస్త్రాలను ధరించి సోషల్ మీడియాలో "+వ్ =ఖుఃఎ ఔట్ష్ర వీవ (+=ఔవీ)" వీడియోలు రూపొందించి పంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవానికి ముందు రోజు అయిన గురువారం ప్రధాని మోదీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక ప్రత్యేక రీల్‌ను విడుదల చేశారు. అందులో ఆగస్టు 7 తేదీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ ఐక్యంగా ముందుకు వచ్చిన రోజు ఇదేనని వివరించారు. ఇటీవల దేశవ్యాప్తంగా యువత ఫ్రెండ్‌షిప్ డేను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని గుర్తు చేసిన ప్రధాని, అదే ఉత్సాహంతో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని కూడా నిర్వహించాలని కోరారు. భారతీయ చేనేతకు సంబంధించిన అవగాహన పెంచడం, సంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భారతదేశంలోని చేనేత కుటుంబాలు తమ చేతులతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్నాయని ప్రధాని మోదీ కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే చేనేత వస్త్రాల వైవిధ్యం, కళాత్మకత ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ఈ దినోత్సవం ద్వారా వారి కృషిని గుర్తించి, వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్న "+వ్ =ఖుఃఎ ఔట్ష్ర వీవ (+=ఔవీ)" ట్రెండ్‌ను కూడా చేనేత ప్రచారానికి వినియోగించాలని ప్రధాని సూచించారు. చేనేత దుస్తులు ధరించి +=ఔవీ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకోవాలని, తద్వారా మరింత మంది చేనేత వస్త్రాలను ఉపయోగించేలా ప్రేరేపించాలని యువతకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు కూడా దోహదపడతాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. చిన్న, పేద చేనేత కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక చేనేత ఉత్పత్తిని కొనుగోలు చేసి, దానికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంటే, దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కళాకారుల ప్రతిభ ప్రపంచానికి మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయం, స్వదేశీ ఉత్పత్తులు, చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పిలుపునిచ్చిన ప్రధాని, జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో మరింత అర్థవంతంగా మార్చాలని ఆకాంక్షించారు. యువత సోషల్ మీడియా శక్తిని సానుకూలంగా వినియోగించి, భారతీయ చేనేతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి – ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది. మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది. ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

అమెరికాలో మరోసారి కాల్పుల మోత.. నార్త్ కరోలినాలో పలువురి మృతి

మొదటిపేజీ తరువాయి – గాయాలతో పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరిని ఆసుపత్రికి తరలించగా, మరికొందరు అప్పటికే మరణించినట్లు నార్త్ కరోలినా స్టేట్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. కాస్వెల్ కౌంటీ షెరిఫ్ టోనీ డర్డెన్ కథనం ప్రకారం, ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో కాల్పులకు పాల్పడిన నిందితుడు కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు. అదే కుటుంబానికి చెందిన నాలుగో వ్యక్తి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం పోలీసులు ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తూ, పలువురిని విచారిస్తున్నారు. అమెరికాలో తుపాకి హింస దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఆగస్టు 2న ఒరెగాన్‌లోని పోర్ట్‌ల్యాండ్‌లో జరిగిన కాల్పుల్లో ఒకరు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు. అలాగే ఆగస్టు 1న ఇడాహోలో జరిగిన మరో ఘటనలో ముగ్గురు మరణించారు. ఈ వరుస ఘటనలు దేశంలో గన్ కల్చర్‌పై ఆందోళనను మరింత పెంచుతున్నాయి.

మిలిటరీ హెలికాప్టర్‌లో ట్రంప్.. సమీపంగా వెళ్లిన కమర్షియల్ విమానం

మొదటిపేజీ తరువాయి – మెరైన్ వన్ హెలికాప్టర్ ఎగురుతున్న సమయంలో.. ప్రయాణికులతో కూడిన విమానాన్ని ఎందుకు ఎగిరేందుకు అనుమతి ఇచ్చారో అర్థం కావడం లేదు. సాధారణంగా దేశాధ్యక్షుడి హెలికాప్టర్ గాలిలో ఉన్నప్పుడు.. మరే విమానాలు ఎగిరేందుకు అనుమతి ఇవ్వరు. ఆ సమయంలో కమర్షియల్ విమానాలను ఆపేస్తారు. జనవరి 2025లో మిలిటరీ హెలికాప్టర్, కమర్షియల్ జెట్ ఢీకొన్న ఘటనలో 67 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ట్రంప్ హెలికాప్టర్, కమర్షియల్ విమానం సమీపంగా ప్రయాణించిన అంశంపై ఫెడరల్ ఏవియేషన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగే పరిస్థితి లేకున్నా.. సేఫ్టీ ప్రోటోకాల్ ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 07-08-2026

ఈ నరకయాతన తప్పేదెప్పుడు..!

చినుకు పడితే చాలు... అంబేద్కర్ నగర్ చౌరస్తా మురుగు చెరువు

ఏళ్లుగా డ్రైనేజీ సమస్యతో కాలనీల ప్రజలకు చుక్కలు

వేలాది మంది రాకపోకలకు అడ్డంకి..అత్యవసర సేవలకు అడ్డంకి

కదలని యంత్రాంగం.....అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న స్థానికులు

నిజం న్యూస్ ప్రతినిధి/ బోడుప్పల్/మేడ్చల్ జిల్లా,ఆగస్ట్ 07 : నగరాభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్ చౌరస్తా మాత్రం నేటికీ డ్రైనేజీ సమస్యతో అల్లాడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా చాలు... డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డంతా వ్యాపిస్తుంది. ప్రధాన కూడలి చెరువును తలపిస్తూ రాకపోకలు స్తంభించిపోతాయి. దేవేందర్ నగర్, రాజీవ్ నగర్, అంబేద్కర్ నగర్, గౌతమ్ నగర్, మల్లయ్య నగర్, క్వార్టర్స్ ,అంబేద్కర్ నగర్ ఫేస్3 కాలనీల ప్రజలు ప్రతిసారి ఇదే నరకయాతనను అనుభవిస్తున్నారు. ఈ చౌరస్తా మీదుగానే వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వర్షం కురిసిన ప్రతిసారి మురుగు నీరు రోడ్డంతా కప్పేయడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. పాదచారులు మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా అదే కథ... మారని పరిస్థితి

ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. స్థానికులు ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం శూన్యమేనని చెబుతున్నారు. తాత్కాలికంగా మురుగు తొలగించడం తప్ప సమస్య మూలాలను పరిష్కరించే చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

నేతాజీనగర్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే, సిఎంసీ కమిషనర్‌కు వినతి బేరి రామచందర్ యాదవ్

-నల్లగండ్ల చెరువు దారి, వాకింగ్ ట్రాక్‌తో పాటు కాలనీ అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి

నిజం న్యూస్ శేరిలింగంపల్లి, ఆగస్టు 6: గచ్చిబౌలి డివిజన్ పరిధిలో లో గల నేతాజీనగర్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలపై గుల్మోర్ పార్క్ అధ్యక్షులు షేక్ ఖాసిం, నేతాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బేరి రాంచందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు, సిఎంసీ కమిషనర్ జి.సృజనకు వినతిపత్రం అందజేశారు. నల్లగండ్ల చెరువు వైపు దారి కల్పించడం, చెరువు వాకింగ్ ట్రాక్‌ను కాలనీ ప్రజలకు అందుబాటులోకి తేవడం, పార్క్ అభివృద్ధి, పిల్లల ఆటస్థలం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధిలైట్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే, కమిషనర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాయుడు, కే నరసింహ యాదవ్, అన్నదొర, గణేష్ నాయక్, రాజు నాయక్, విట్టల్ నాయక్, మణికంఠ, బుడగ జంగాల లక్ష్మణ్, గుల్మోర్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, యువజన నాయకులు, మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొని కాలనీలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పార్కుల ఆక్రమణలు తొలగించి సుందరీకరణ చేపట్టాలి: తుంగతుర్తి రవి

నిజం న్యూస్ ప్రతినిధి, బోడుప్పల్,ఆగస్టు 07: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కలిసి సాయి ప్రియా నగర్‌లోని పార్కులపై జరుగుతున్న కబ్జాలను వెంటనే తొలగించి, మున్సిపల్ నిధులతో పార్కులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కోరారు. పార్కులను పరిరక్షించి చిన్నారులు, మహిళలు, వృద్ధులు వినియోగించుకునేలా అభివృద్ధి చేయాలని,ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని తుంగతుర్తి రవి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో సుదర్శన్ రెడ్డి, నాగరాజు, సాయిరాం గౌడ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పోరేటర్లు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 6: బోనాల పండుగ సందర్భంగా మూసాపేట్ భవానీ నగర్, గూడ్స్ షెడ్ రోడ్, లచ్చయ్య నగర్, అంబేద్కర్ నగర్, బాబు జగ్జీవన్ రామ్ నగర్ మారుతి నగర్,మూసాపేట్ వార్డు కార్యాలయం, మెయిన్ రోడ్, జనతా నగర్ లలో వెలసిన అమ్మవార్లను కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పోరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబు రావు ,పండాల సతీష్ గౌడ్ తో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి దయాకటాక్షాలు ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకం -- బండి రమేష్

నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి ఆగస్టు 6: తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో పోరాడిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మూసాపేట్ ఆంజనేయ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి బండి రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, ప్రజల్లో ఆత్మగౌరవం, స్వాభిమానాన్ని పెంపొందించిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ ని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి బీజం వేసి, గ్రామం నుంచి నగరం వరకు ప్రతి తెలంగాణవాసి హృదయంలో ఉద్యమ జ్వాలను రగిలించిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా చివరి శ్వాస వరకు అవిశ్రాంతంగా శ్రమించిన జయశంకర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన కలలుగన్న సమానత్వ తెలంగాణను నిర్మించడం, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని బండి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశాల్, సంతోష్, గోవింద్, బాలరాజు, నర్సింగరావు, ప్రభాకర్, సలీం, లక్ష్మీనారాయణ, యాదగిరి, ప్రకాష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి గద్దర్ చిత్రపటానికి ఘన నివాళులు

నిజం న్యూస్ ప్రతినిధి , ఉప్పల్,ఆగస్టు 06: ప్రజాకవి గద్దర్ (గుమ్మడి విట్టల్ రావు) 3వ వర్ధంతి సందర్భంగా గురువారం ఉప్పల్ రాఘవేంద్ర కాలనీ చౌరస్తాలో ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌన నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్ పాటల ద్వారా కోట్లాది ప్రజల్లో చైతన్యం నింపారని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ప్రజాకవి, ప్రజా గాయకుడు, సామాజిక ఉద్యమకారుడిగా గద్దర్ చూపిన మార్గం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ..తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ సేవలను చిరస్మరణీయంగా నిలిపేందుకు పలు చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా "గద్దర్ అవార్డులు" ఏర్పాటు చేసి కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గౌరవించడం కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ పట్ల చూపుతున్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గద్దర్ ఆశయాలను భావితరాలకు చేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బజార్ జగన్నాథ్ గౌడ్ (కాంగ్రెస్ పార్టీ రామంతపూర్ డివిజన్ కోఆర్డినేటర్), సందీప్ భూషణ్ (స్టేట్

జనరల్ సెక్రటరీ, ఎస్సీ సెల్), డా. ఏడ్ల అంజయ్య (సీనియర్ కాంగ్రెస్ నాయకులు), నాగరాజు (సీనియర్ కాంగ్రెస్ నాయకులు), డా. దుబ్బ రంజిత్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఎకనామిక్స్), డా. ఆర్.ఎన్. శంకర్ (పీహెచ్ .డి ఎకనామిక్స్), డా. కిరణ్ సుకినే (పి హెచ్ .డి కామర్స్), సతీష్ (పి హెచ్ .డి కామర్స్), డా. రాజీవ్ (పి హెచ్ .డి తెలుగు), డా. గొర్రె రాజు (పి హెచ్ .డి బిజినెస్ మానేజ్మెంట్), ఎం.డి. అష్రఫ్ (యూత్ నాయకులు), పవన్, శ్రీకాంత్ ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

నిజం న్యూస్ ప్రతినిధి, బోడుప్పల్,ఆగస్టు 06 : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో చాలాకాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఈ సందర్భంగా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , బోడుప్పల్ డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ స్థానిక ప్రజలతో కలిసి జరుగుతున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంబేద్కర్ నగర్‌లో చాలాకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడం సంతోషకరమని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ,డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు డ్రైనేజీ సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , సీనియర్ నాయకులు దానగళ్ళ యాదగిరి , స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా వెతిరేక విధానాల పై సిపిఐ పోరాటం..సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్

నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 6: సిపిఐ ఆధ్వర్యంలో దేశ రాజధాని డిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా లో భాగంగా సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం నిజాంపేట్ సర్కిల్ వద్ద "బద్లావ్ జరూరి హై" (మార్పుకావాలి.) కేంద్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వెతిరేక విధానాలను నిరసనగా ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ బీజేపీ ఏర్పాటు చేసి 12 సంవత్సరలు దాటినా ఇప్పటికి పేద ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. పేద ప్రజలకు వెతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ పాలనా కొనసాగుతుంది అని గుర్తుచేశారు. ప్రభుత్వ సంస్థలు అని ప్రవేటికరిస్తున్నారు కార్మికలకు వెతిరేకంగా కార్మిక చట్టాలు తెచ్చారు. రైతులకు వెతిరేకంగా రైతు చట్టాలు తెచ్చారు. ఇప్పుడు అమెరికతో పత్తి కొనుగోలు ఒప్పందం చేశారు. మరీ భారత దేశంలో పండిన పత్తి ఎక్కడ అమ్మాలో మోడీ చెప్పాలి అని ప్రశ్నించారు. కనుక సెప్టెంబర్ 1వ తేదీన జంతర్ మంతర్ దగ్గర జరిగే ఛలో డిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గోని ప్రజల అనుకూల ప్రభుత్వాని ఏర్పాటు చేసుకునే దిశగా మనం ముందుకు పోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఏఐటీయూసీ కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, వెంకటేష్, యాకన్న, మల్లన్న, కృష్ణ, యదన్న, నర్సమ్మ, సత్తమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్ శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్



నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 6: ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగ తెలంగాణ కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, టి పి సి సి ఉపాధ్యక్షులు , కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మూసాపేట్ గాంధీ బొమ్మ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని సప్పిడి భాస్కర్ మరియు సప్పిడి వినీత్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఆషాఢ బోనాల పండుగ మన ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పే మహోన్నత ఉత్సవమని అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలంతా ఐకమత్యంతో, భక్తి శ్రద్ధలతో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సప్పిడి భాస్కర్ మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని ప్రజా ప్రభుత్వం తరపున శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.38,500 ఆర్థిక సహాయంగా చెక్కు మంజూరైనందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి, మరియు బండి రమేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పటోళ్ల నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్ కుమార్, మహిళా అధ్యక్షురాలు జోజమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ యాదవ్, బాల్ రాజ్, జయమ్మ, పుష్ప మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి డివిజన్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 6: ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్ పోచమ్మ ఆలయం, దయార్‌గూడ నల్ల పోచమ్మ ఆలయం, ప్రకాశ్‌నగర్ చేపల బస్తీ పోచమ్మ ఆలయాలను ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, కూకట్ పల్లి ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంలో సుభిక్షం నెలకొనాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కూకట్ పల్లి డివిజన్ సీనియర్ నాయకులు చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ రావు,అనంత నాగరాజు, దుర్గా ప్రసాద్ రావు, ప్రశాంత రావు,అకింపల్లి సాయి,చంద్ర ప్రకాష్ రెడ్డి, భాను,శివ పటేల్,రమణారెడ్డి, ఫణీంద్ర శర్మ, వినయ్ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 6: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీజీపీ సి.వి. ఆనంద్ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీజీ మహేష్ భగవత్ (లా ఉ ఆర్డర్) , డీఐజీ నారాయణ నాయక్ తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TS/TEL/25/A3731
శుక్రవారం 07-08-2026

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 206 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

తెలంగాణకు ప్రత్యేక కోటా లేదు -- అర్హత ఉంటే దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకునే అవకాశం

ఆగస్టు 06 నిజం న్యూస్: ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా (దీూదీ) పలు విభాగాల్లో 206 స్పెషలిస్ట్ ఆఫీసర్ (ూూ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఆగస్టు 26, 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలు

మొత్తం ఖాళీలు: 206

ఉద్యోగాలు: Specialist Officer (వివిధ విభాగాలు)

ఉద్యోగ స్థలం: భారతదేశవ్యాప్తంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేదీ: 26 ఆగస్టు 2026

తెలంగాణకు ఎన్ని పోస్టులు?

ఈ నోటిఫికేషన్‌లో తెలంగాణకు ప్రత్యేకంగా పోస్టుల కేటాయింపు లేదు. ఇది ఆల్ ఇండియా రిక్రూట్‌మెంట్ కావడంతో తెలంగాణ అభ్యర్థులు కూడా ఇతర రాష్ట్రాల అభ్యర్థులతో సమానంగా దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టింగ్ బ్యాంక్ అవసరాలను బట్టి దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఉండే అవకాశం ఉంది.

జీతం ఎంత?

పోస్టును బట్టి వేతనం మారుతుంది. సుమారుగా:

Officer (JMG Scale-I): ?48,480 -- ?85,920

Manager (MMG Scale-II): ?64,820 -- ?93,960

Senior Manager (MMG Scale-III): ?85,920 -- ?1,05,280

Chief Manager/పై స్థాయి పోస్టులు: ?1,02,300 నుండి ప్రారంభం

వేతనంతో పాటు ణూ, ఎ=ూ, జజూ, మెడికల్, ూఖీ, గ్రాచ్యుటీ వంటి ఇతర బ్యాంకింగ్ అలవెన్సులు కూడా వర్తిస్తాయి. (ఝుతీవవతీ ూశీఽవతీ??)

ఎంపిక విధానం

ఆన్‌లైన్ పరీక్ష (అవసరమైతే)

షార్ట్‌లిస్టింగ్

వ్యక్తిగత ఇంటర్వ్యూ

డాక్యుమెంట్ వెరిఫికేషన్ (ూాటటుఅతీంజశ్రీశీబ౧??)

అర్హత

పోస్టును బట్టి డిగ్రీ, బి.టెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ వంటి అర్హతలు మరియు సంబంధిత అనుభవం అవసరం ఉంటుంది. ప్రతి పోస్టుకు వేర్వేరు అర్హతలు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. (౨వర్ఎశీశీ౨??)

పత్రిక హెడ్లైన్

"బ్యాంక్ ఆఫ్ బరోడాలో 206 ఉద్యోగాలు.. ఆగస్టు 26 వరకు దరఖాస్తులకు అవకాశం"

సబ్ హెడ్డింగ్స్

206 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ

తెలంగాణకు ప్రత్యేక కోటా లేదు

గరిష్ఠంగా ?1.05 లక్షలకుపైగా వేతనం

ఆన్‌లైన్‌లో ఆగస్టు 26 వరకు దరఖాస్తులు

ఓర్నాయనో.. బ్రెడ్ తినే అలవాటుందా..? అయితే, ఆ సమస్య రావడం పక్కా అంట..

ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది.. ఏది అందుబాటులో ఉంటే.. అది తింటుంటారు.. కొంతమంది సమయం లేక బ్రెడ్ లాంటి వాటిని తింటారు. ఉదయం వేళ టీతో లేదా.. సాయంత్రం వేళ స్నాక్స్ గా బ్రెడ్ తీసుకుంటారు.. అయితే.. మీరు ప్రతిరోజూ అల్పాహారంగా బ్రెడ్ తింటుంటే, ఈ వార్త మీకు ఉపయోగకరంగా ఉండవచ్చు.. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది.. ఏది అందుబాటులో ఉంటే.. అది తింటుంటారు.. కొంతమంది సమయం లేక బ్రెడ్ లాంటి వాటిని తింటారు. ఉదయం వేళ టీతో లేదా.. సాయంత్రం వేళ స్నాక్స్ గా బ్రెడ్ తీసుకుంటారు.. అయితే.. మీరు ప్రతిరోజూ అల్పాహారంగా బ్రెడ్ తింటుంటే, ఈ వార్త మీకు ఉపయోగకరంగా ఉండవచ్చు.. మీరు క్రమం తప్పకుండా బ్రెడ్ తీసుకుంటుంటే జాగ్రత్తగా ఉండాలని.. వైట్ బ్రెడ్ చాలా సమస్యలను కలిగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి ఇప్పుడు బ్రెడ్ అనేక రకాలుగా లభిస్తుంది. సాధారణంగా, బ్రెడ్‌లో శుద్ధి చేసిన పిండిని కలుపుతారు. వైట్ బ్రెడ్‌లో ఫైబర్ కంటెంట్ అస్సలు ఉండదు. ఇది కాకుండా, బ్రెడ్ పాతబడటం వల్ల చాలా నష్టాలు ఉన్నాయి. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన వాటిని తినడం వల్ల పలు సమస్యలు వచ్చే అవకాశం ఉంది.. అయితే.. బ్రెడ్ తినడం వల్ల మలబద్ధకం వస్తుందా? అది ఆరోగ్యానికి ఎంత మంచిది..? ప్రమాదకరం? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.. బ్రెడ్ తినడం సాధారణంగా సురక్షితమని భావిస్తారు. బ్రెడ్ సులభంగా జీర్ణమవుతుందని, ఇది కడుపు సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని చెబుతారు. చాలా మంది ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు, వారు రోటీకి బదులుగా బ్రెడ్ తినడం ప్రారంభిస్తారు. కానీ వైద్య శాస్త్రం ఈ విషయాలను సరైనదిగా పరిగణించదని నిపుణులు చెబుతున్నారు.

బ్రెడ్ మలబద్ధకానికి కారణమవుతుందా..

ఢిల్లీలోని రాజీవ్ గాంధీ హాస్పిటల్ అదనపు ప్రొఫెసర్ డాక్టర్ అజిత్ జైన్ వివరిస్తూ, బ్రెడ్‌లో దాదాపు ఫైబర్ ఉండదు. దీని కారణంగా జీర్ణవ్యవస్థ ప్రభావితమవుతుంది. ఫైబర్ ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది మలవిసర్జనను సులభతరం చేస్తుంది. ఫైబర్ లేకపోవడం వల్ల మలవిసర్జనలో ఇబ్బంది ఏర్పడుతుంది. మీరు బ్రెడ్‌ను క్రమం తప్పకుండా తింటే, శరీరానికి తగినంత ఫైబర్ అందదు.. దీని కారణంగా ఆహారాన్ని జీర్ణం చేయడంలో ఇబ్బంది ఏర్పడుతుంది.. మలబద్ధకం సంభవించవచ్చు. బ్రెడ్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలహీనపడుతుంది. దీనితో పాటు, బ్రెడ్ కారణంగా అపానవాయువు, గ్యాస్, ఆమ్లత్వం సమస్య కూడా వస్తుంది.

బ్రెడ్.. క్యాన్సర్‌కు కారణమవుతుందా?

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం.. బ్రెడ్ వినియోగం %-% క్యాన్సర్ పై అనేక అధ్యయనాలు జరిగాయి.. కానీ బ్రెడ్ కడుపు లేదా మరే ఇతర క్యాన్సర్ మధ్య ప్రత్యక్ష సంబంధం కనుగొనబడలేదు. బ్రెడ్ తినే వ్యక్తులు ఏదైనా ప్రత్యేకమైన క్యాన్సర్‌ను అభివృద్ధి చేయలేదు కానీ.. బ్రెడ్ ఖచ్చితంగా మలబద్ధకానికి కారణమవుతుంది.

బ్రౌన్ బ్రెడ్ తినవచ్చా లేదా?

అల్పాహారంగా బ్రెడ్ తినే అలవాటు ఉంటే, బ్రెడ్ ఎంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ జైన్ అంటున్నారు. వైట్ బ్రెడ్ కు బదులుగా బ్రౌన్ బ్రెడ్ తినవచ్చు. బ్రౌన్ బ్రెడ్ పిండితో తయారు చేయబడింది.. ఇది తగినంత ఫైబర్ కలిగి ఉంటుంది. బ్రౌన్ బ్రెడ్ తినడం ద్వారా, శరీరానికి తగినంత ఫైబర్ లభిస్తుంది.. ఆహారం జీర్ణం కావడం సులభం అవుతుంది.

కరీంనగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం -- రాష్ట్ర ఉన్నతాధికారులతో మేయర్ కొలగాని శ్రీనివాస్ విస్తృత స్థాయి సమావేశాలు

సీడీఎంఏ, ప్రధాన కార్యదర్శి, డీటీసీపీ, ఈఎన్సీ అధికారులకు నగర అభివృద్ధి ప్రణాళికలపై వినతులు

ఆగస్టు 06 నిజం న్యూస్: కరీంనగర్ నగరాన్ని ఆధునిక, ప్రణాళికాబద్ధమైన, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కలిగిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు హైదరాబాద్‌లోని మున్సిపల్ పరిపాలన శాఖ కార్యాలయాల్లో రాష్ట్ర ఉన్నతాధికారులతో వరుసగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ & డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (జణవీూ) డా. టి.కె. శ్రీదేవి, ఐూూ గారితో పాటు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (ణుజా), ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఔజీజ) తదితర ఉన్నతాధికారులను కలిసి కరీంనగర్ నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మేయర్ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రత్యేక నిధులు, పరిపాలనా అనుమతులు, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ముఖ్యంగా నగరంలోని ఆర్ & బీ రోడ్లకు అత్యవసర ప్యాచ్‌వర్క్, పునరుద్ధరణ పనులు, తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని వేగవంతం చేయడం, అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, విలీన గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య వసతులు, స్మార్ట్ వాటర్ డ్రైనేజ్ వ్యవస్థ విస్తరణ, లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణ చర్యలు, స్మార్ట్ సిటీ మరియు యూఐడీఎఫ్ పనులను వేగవంతం చేయడం, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, పట్టణ సుందరీకరణ వంటి అంశాలను ప్రస్తావించారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించిన మేయర్, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్ నగర విస్తరణను దృష్టిలో ఉంచుకొని సమగ్ర మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని డీటీసీపీ అధికారులను కోరారు. ఇంజినీరింగ్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్ తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, అభివృద్ధి పనుల అమలు వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించాలని ఈఎన్సీ దృష్టికి తీసుకెళ్లారు. విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అక్కడ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు, విద్యుత్ వీధి దీపాలు వంటి సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ చర్యలకు అవసరమైన అనుమతులు, నిధులు అందించాలని కూడా మేయర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరిన మేయర్, నగర అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన ఆమోదాలు మంజూరు చేయాలని అధికారులను అభ్యర్థించారు. మేయర్ సమర్పించిన ప్రతిపాదనలను అధికారులు సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాధాన్యత పనులను వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలు కరీంనగర్ నగర భవిష్యత్ అభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తాయని, ప్రజల ఆశలకు అనుగుణంగా అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు తెలిపారు.

డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

హాజరైన కార్యవర్గ సభ్యులు మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు

నేతలకు దిశా నిర్దేశం చేసిన డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

జిల్లాలో ూూ= ను 100% పూర్తి చేయండి - డాక్టర్ మేడిపల్లి సత్యం

ఖఖ= రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు - మేడిపల్లి సత్యం

ఆర్థిక సంక్షోభంలోనూ రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల నెరవేర్చింది

ప్రతి నియోజకవర్గానికి 3500 o 2000 ఇందిరమ్మ ఇండ్లు - హైదరాబాద్‌లో 1 లక్ష ఇండ్లు

2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చూస్తున్న ప్రతిపక్షాలకు పార్టీ శ్రేణులు 10 రెట్లు గట్టి సమాధానం ఇవ్వాలి

ప్రతి 15 రోజులకు ఒకసారి ఇజజ కార్యవర్గ సమావేశం - మేడిపల్లి సత్యం

ఆగస్టు 06 నిజం న్యూస్: చొప్పదండి ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి హాజరైన నేతలకు భవిష్యత్ కార్యాచరణ గురించి మేడిపల్లి సత్యం దిశానిర్దేశం చేసినారు ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మేడిపల్లి సత్యం గారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారు. 2023 తర్వాత ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి గారు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూ ఒక విజన్ తో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తూ సొంత ఇంటి కలను నిజం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగింది. రెండో విడతలో మరో రెండు వేల ఇండ్లు కేటాయించడం జరిగింది హైదరాబాద్ మహానగరంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన కేసీఆర్ ఎక్కడ వేల పుస్తకాలు చదివానని తనకంటే గొప్ప మేధావి ఎవరూ లేరని చెప్పుకున్న కేసీఆర్ కనీసం తన సొంత గ్రామంలో కానీ రాష్ట్రంలో ఎక్కడ కూడా ఒక పేదవానికి ఇల్లు కట్టించిన దాఖలాలు లేవు 200 యూనిట్ల ఉచిత కరెంటు తో గ్రామీణ ప్రాంతాల్లో 99% పేద ప్రజలు లబ్ధి పొందుతున్నారు భారతదేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 20వేల కోట్ల రూపాయలతో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసింది మన ప్రభుత్వం నాడు కెసిఆర్ ప్రభుత్వం పది వేల పైన ఒక్క వడ్ల గింజ కొనకపోవడంతో నష్టపోయిన రైతులకు ఉండాల నిలిచింది గతంలో నీళ్ల నిధుల నియామకాల విషయంలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతను రోడ్డున పడేశారు గత బిఆర్ఎస్ నిరంకుశ ప్రభుత్వంలో మంచం ఒక ధర్నాకు పిలుపునిస్తే ఐదు గంటలకే పోలీసులు మన ఇంటి ముందు ఉండేవారు నాడు ధర్నా చౌక్ ను కూడా ఎత్తేసి ఎంత ఇబ్బంది పెట్టినారో మనందరికీ తెలుసు.. ఆ ప్రభుత్వాన్ని బొంద పెట్టి ప్రజలకు స్వేచ్ఛను అందించింది కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాలకు మించి మెరుగైన పరిపాలన ప్రజలకు అందించడంతో బిజెపి, బి ఆర్ఎస్ వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రచారం చేస్తుంది అదే సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ శ్రేణులు పదింతలు యాక్టివ్ గా ఉండాలి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రోడ్లపై ధర్నాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 కే వంట గ్యాస్ సిలిండర్ ఈ విధంగా మహిళలకు సంబంధించి మన ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో వారు ఎంతో ఆనందంగా ఉన్నారు, మునుముందు మరిన్ని సంక్షేమ పథకాలు మహిళల కోసం మన ప్రభుత్వం ప్రవేశపెట్టబోతుంది. ప్రతిపక్షాలకు గట్టి సమాధానం ఇవ్వడంలో కార్యకర్తలు చురుకుగా ఉండాలి కాంగ్రెస్ ప్రభుత్వం పై పార్టీపై జరుగుతున్న విష ప్రచారాలను తిప్పికొట్టడంలో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర చేసింది బిజెపి 23 లక్షల మంది నీట్ పరీక్ష రాస్తే ఆ పేపర్ లీకేజీ పాల్పడింది బిజెపి ప్రభుత్వం మన సమాచార హక్కు చట్టం ఆహార భద్రత చట్టం లాంటి ఎన్నో యూపీఏ ప్రభుత్వ పాలనలో తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టం విప్లవాత్మక చట్టాలను తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రావాలని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది రాహుల్ గాంధీ గారు ప్రధాని అవుతారని ప్రజలందరూ ఆశిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ మనకు ఏం చేసింది అని మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి మనం ఏమి ఇచ్చాము అనే విధంగా ఆలోచించాలి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సహనం చాలా ఎక్కువగా ఉంది.. అయితే కాంగ్రెస్ పార్టీని మన ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో కొన్ని సందర్భాల్లో తీవ్రంగా ప్రతిఘటించే విధంగా సిద్ధంగా ఉండాలి నేతల మధ్య విభేదాలు ఉండకూడదు మనమంతా ఐకమత్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీ తీసుకునే ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం ఇకనుండి ప్రతి 15 రోజులకు ఒక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు జిల్లా రాష్ట్ర స్థాయి రాజకీయాలను ఆశించే స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాం.ఒకటికి రెండు పనులు చేసి బిఆర్ఎస్ పార్టీ గొప్పలు చెప్పుకుంటుంది. ఇప్పని మాట ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని క్షేత్రస్థాయిలో ప్రజలలోకి తీసుకెళ్లాలి ఈ విషయంలో మనం వెనుకబడి ఉన్నాం ఈ దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన కాంగ్రెస్ పార్టీకి పనిచేయడం అంటే ఈ దేశానికి పనిచేసినట్టుగానే ఈ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు

తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ పై గరం అయిన తెలంగాణ జమీయత్ ఉలేమా ఎ హింద్!

మైనార్టీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న సర్కార్ వెంటనే తమ తీరును మార్చుకోవాలి..

మైనారిటీల హామీలు అమలు చేయాలి..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి..

జమియత్ ఉలేమా తెలంగాణ డిమాండ్!

ఆగస్టు 06 నిజం న్యూస్: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జమియత్ ఉలేమా ఎ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షా వలీఉల్లా ఖాస్మీ రహ్మానీ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దారుల్ ఉలూమ్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన మైనారిటీ సంక్షేమ హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. అనాటి హామీలను నెరవేర్చకుండా మైనారిటీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఎద్దేవా చేశారు. మైనారిటీ ఉప ప్రణాళికను అమలు చేసి, మైనారిటీల కోసం ప్రకటించిన రూ.4,000 కోట్ల బడ్జెట్‌ను పారదర్శకంగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఇమామ్‌లు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచి సకాలంలో చెల్లించడంతో పాటు, వక్ఫ్ ఆస్తుల రక్షణకు కఠిన చర్యలు తీసుకుని వక్ఫ్ బోర్డును బలోపేతం చేయాలని కోరారు.ఉర్దూ భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి, ఉర్దూ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా సహాయం, కోచింగ్, హాస్టల్ సౌకర్యాలు, రాయితీ రుణాలను పునరుద్ధరించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలన్నీ విడుదల చేసి కళాశాలలకు నిధులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమియత్ ఉలేమా తెలంగాణ



రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా ముఖ్తార్, (గంథాలయ చైర్మన్ డాక్టర్ హఫీజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్ ఖాన్, జిల్లా కార్యదర్శి హాఫీజ్ ఫుర్ఖాన్, ముఫ్తీ రియాజ్, మౌలానా జుబైర్, మౌలానా హుస్సేన్, మౌలానా సామీ, ముఫ్తీ ఉమర్, హాఫీజ్ మతీన్, హాఫీజ్ సోహైల్, హాఫీజ్ హబీబ్, మౌలానా ఫిరాసత్, ఫైసల్, ముఫ్తీ ఘౌస్, హాఫీజ్ షంషుద్దీన్, ముఫ్తీ కలీమ్, మౌలానా అతా ఉర్ రహ్మాన్, మౌలానా ఫారూక్, జానీ, బాబా తదితరులు పాల్గొన్నారు.